# ఒక దురంతం

సీతాపతికీ నాకూ మధ్య ఉన్నది పరిచయం కంటె ఎక్కువా, స్నేహితం కంటె తక్కువానూ. అన్యోన్యంగానే ఉంటాం. పరస్పరాభిరుచులామోదిస్తాం. ఇద్దరికీ సంబంధించిన విషయాలను స్వేచ్ఛగా చర్చిస్తాం. ఒకరి ఆనందం ఒకరం పంచుకుంటాం కూడా – కాని ఎవరి బాధలు వారే ఉంచుకుంటాం. ఒకరి మర్యాద కాపాడటం ఒకరం మర్చిపోం. "ఏమండీ" అనే సంబోధించుకుంటాం. అతని స్నేహితుల్లో నాతో పరిచయం లేని వాళ్ళున్నారు. అతన్నెరగని స్నేహితులు నాకూ ఉన్నారు.

మేం రోజూ తప్పకుండా కలుసుకుంటాం. కనీసం ఒక గంటసేపైనా సాయంకాలం పూట కాలక్షేపం జరిగిపోతుంది. షికారుకైనా, సినిమాకైనా పోతే ఇంకా ఎక్కువే జరుగుతుంది.

ఎందుకో చెప్పలేనుగాని అతను మా యింటికి రావటంకన్న నేనతనింటికి పోవటమే చాలా ఎక్కువ. అతనే మాయింటి కెందుకు రాకూడదు. నేనతనింటి కెందుకెళ్లాలి! అతని ఎక్కువేం నా తక్కువేమనే విచారం నాకులేదు. నీరు ఎప్పుడూ ఒక వేపే ప్రవహించటం మంచిదనే లెక్కలో వాణ్ణి.

అలవాటు ప్రకారం ఓ రోజతని ఇంటికి వెళ్ళేసరికి అతను కుర్చీ, కిటికీ కెదురుగా వేసుకొని కూర్చుని కిటికీలో కాళ్ళు పెట్టుకుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అతని భార్యాపిల్లలు ఊళ్ళోలేని కారణంచేత బావురుమంటున్న ఆ ఇంట్లో. ఆ గదిలో ఒంటరిగా అతనట్లా కూచుని ఉంటే నాకేదో విపరీతంగా తోచింది. దానికి తగినట్టుగానే అతను ఎంత పరధ్యానంగా ఉన్నాడో ఏమిటో, నా అలికిడైనా వినలేదు. నేను పేరు పెట్టి పిలవగానే అతను ఉలికిపడి పెద్ద చప్పుడుతో నాకేసి తిరిగేసరికి అతని ముఖం భయంకరంగా కనిపించింది.

నా మనస్సులో బయటికి కానరాని సందేహాలన్నీ ఒక్కసారిగా పరుగెత్తినై.

"ఏమిటండీ, సీతాపతిగారూ?" అన్నాను.

అతను నవ్వటానికి వ్యర్థ ప్రయత్నం చేసి పెదిమలు నాక్కుని జుట్టు తడువుకుంటూ, "ఏమి లేదు.... కూర్చోండి... అట్లా కుర్చీ లాక్కోండి" అన్నాడు.

"కాదేదో ఉంది! చెప్పాలి!" అన్నాను. నేనదివర కాయనతో అట్లా మాట్లాడలేదు. ఆ క్షణంలో నాకు మా యిద్దరిమధ్యా ఉన్న ఎడం చూసి విచారం కలిగినట్టయింది. అతను నిజంగా ఏదైనా యిబ్బందిలో ఉంటే నేనెందుకు సానుభూతి సహకారాన్నివ్వగూడదు? అతని యిబ్బంది భార్యా బిడ్డలకుగాని ఇతరులకుగాని సంబంధించినది కాదని తెలిసిపోయింది; కాని పక్షంలో అతను నవ్వటానికి ప్రయత్నించడు. ఏమీ లేదని అసలే అనడు. ఇక, అదేదో అతని సొంత బాధ అయి ఉండాలి. అయినా తెలుసుకోవాలని నాకు పట్టుదల కలిగింది. అందుచేత చెప్పి తీరాలని గుచ్చి గుచ్చి అడిగాను.

ఆఖరుకతను మెత్తబడుతూ, "చెబుతానూ, కాని మధ్యలో మీరు నన్ను ఏ అడ్డుప్రశ్నా వెయ్యకూడదు. నేను చెప్పేది సాంతం వినేవరకూ ఏమీ మాట్లాడనేవద్దు. ఊరికే ఊఁ కొట్టండి" అన్నాడు. నేను సరే అన్నాను.

❀ ❀ ❀ ❀ ❀

నాకో స్నేహితుడున్నాడు – పేర్లడగవద్దు (అని అతను ప్రారంభించాడు). అతను నా అతి బాల్య స్నేహితుల్లో ఒకడు. మా స్నేహం ఆదర్శ దాంపత్యం లాంటిది. ఇద్దరు వ్యక్తుల మధ్య ఎటువంటి వ్యక్తిత్వమూ లేకుండా ఇద్దరికీ కలిపి వ్యక్తిత్వం ఉండటం సాధ్యమయే పక్షంలో మా ఇద్దరికీ ఆ పరిస్థితి ఉంటూ వచ్చింది. మేం ఒకరి దగ్గర ఒకళ్ళం స్వార్థం ప్రకటించుకోవలసిన అవసరంగాని ఒకరినొకరం పొరపాటునైనా అపార్థం చేసుకోవటంగాని ఎన్నడూ జరగలేదు. మా ఇద్దరిలోనూ ఒకడి మనస్సు చిరాకుగా ఉన్నపుడింకొకడు సంతోషించగలగటం గాని, ఒకడికి రోగం వచ్చినప్పుడు రెండోవాడు ఆరోగ్యం పొంగిపోతున్నట్టు భావించుకోగలగటం గాని అసంభవంగా ఉండేది... శరీరాలతో కంటె మనస్సులతో ఎక్కువగా జీవించే బాల్యావస్థలో ఏర్పడ్డ సావాసం గనక అంతదూరం వెళ్ళగలిగిందనుకుంటాను. నాకు పన్నెండో ఏడు వెళ్ళిన తరువాత అటువంటి సావాసం చేసే అవకాశం నాకు రానే లేదు.

నా స్నేహితుడు కాలేజీ చదువు తలపెట్టలేదు. వాడికి ఎకౌంటెన్సీ పరీక్షల మీద మనసు పోయింది. నాకు డిగ్రీలమీద మనసుపోయింది. మా యిద్దరి దారులు చీలినై, కాని మనసులు చీలలేదు.

"ఒరే నువు కనీసం ఒక డాక్టరేటన్నా కొట్టకపోతే నేనూరుకోను" అన్నాడు నా స్నేహితుడు.

"నువ్వు కనీసం నెలకు రెండువందలన్నా సంపాదించకపోతే నా మనస్సు చిన్నబోతుంది" అన్నాను నేను.

తీరా నాకు డిగ్రీ కూడా రాలేదు. నా జీవితం అయోమయంలో పడి, నా చదువుకు సంబంధంలేని ఉద్యోగాలు ఒకదాని వెంట ఒకటి సంపాదించి పోగొట్టుకుంటూ మధ్య మధ్య డబ్బులేక నానా అగచాట్లూ పడుతూ ఉంటే వాడు చక్కగా పరీక్షలు పాసయి నిశ్చింతగా ఇన్సూరెన్సు కంపెనీలో మూడువందల రూపాయల ఉద్యోగంలో స్థిరపడిపోయినాడు.

ఆ మధ్య ఆరునెల్లపాటు నాకు ఉద్యోగం లేకపోతే నన్ను తన దగ్గరికి పిలిపించు కున్నాడు. అంతకు పూర్వమే వాడి భార్య పోయింది. కనీసం సంసార విషయంలో వాడికన్న నేనే అదృష్టవంతుణ్ణని రుజువయింది. వాడి మొదటి భార్య సుఖపడలేదు. అది వాడి తప్పని నేను నమ్మలేదు. వాడి భార్య అదో రకం పశువు. అంతకంటె ఆవిణ్ణి గురించి నాకు మరో అభిప్రాయం లేదు.

నేను నా స్నేహితుడి దగ్గర ఉంటున్న కాలంలో నా భార్యా పిల్లా మా అత్తవారింటి దగ్గిరే ఉన్నారు. అందుచేత మళ్ళీ మేమిద్దరమూ చిన్ననాటి రోజులు తిరిగి సంపాదించగలిగాం. నా మటుకు నాకు ఉద్యోగం లేదనే విషయమూ స్మరణకైనా రాకుండా పోయినై.

నా ఆనందం మరింత కావటానికి నా స్నేహితుడు తిరిగి పెళ్ళాడే ప్రయత్నంలో ఉన్నట్టు తెలిసింది. కాని వాడు పెళ్ళాడ సంకల్పించిన మనిషిని చూసి ఆవిణ్ణి గురించి కొంత తెలుసుకునేటప్పటికి నా ఆనందం కాస్తా విషమించింది.

వాడు పెళ్ళాడటానికి చూస్తున్న మనిషి షుమారుగా అందంగానే ఉంటుంది. సాధువే, అమాయకంగానే ఉంటుంది. కానీ ఆమెకి శీలం ఏమీలేదు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోయినారు. ఎవడికో ఇచ్చి పెళ్ళి చేశారు. తరువాత ఆమెని మొగుడూ, అత్తగారూ, మామగారూ, బావగార్లూ, వదినెగార్లూ, తోడికోడళ్ళూ అందరూ కలిసి రంపపుకోత కోస్తుంటే పడలేక ఆమె పుట్టింటి నుంచి లేచిపోయింది. ఆనాటినించీ ఈనాటివరకూ ఆమె ఎవడో ఒకడి వెంట ఉంటూనే ఉంది. ఇటీవల ఆమె మొగుడు కూడా పోయినాట్ట. నా స్నేహితుడు పెళ్ళాడక పెళ్ళాడక ఇటువంటి దాన్నెందుకు పెళ్ళాడాలో నాకసలే అర్థం కాలేదు.

ఈ విషయం వాడితో ఒకసారి సూచనగా అన్నాను. వాడు, "నా కంతా తెలుసును – కాని ప్రపంచంలో బొత్తిగా చెడ్డవాళ్ళు లేరని నా నమ్మకం. ఈ మనిషికి నామీద తగినంత గౌరవం ఉంది. ఆ మనిషిలో చాలా మానవత్వం ఉంది. నిష్కల్మషమైన హృదయం. భార్యలో నా కంతకంటె ఎక్కువ అవసరంలేదు. ఇంకోరి కష్టాలు పంచుకునే శక్తి ఉందామెకి" అన్నాడు.

కాని ముందుముందు ఈ మనిషి నా స్నేహితుడి పేరు మట్టిలో కలపదని ఎట్లా? తన పక్కన ఎవరు పడుకున్నాడనే జ్ఞానమైనా లేని మనిషి రేపు నా స్నేహితుణ్ణి పెళ్ళి చేసుకున్నాకనయినా సరిగా ఉంటుందని ఏమిటి? ఆమె అన్నివిధాలా మంచిదే కావచ్చుగాక. కాని ఆమెకి ఉండదగినంత దేహాభిమానం లేదు. పూర్వం ఆమెతో స్నేహం చేసిన వాళ్ళల్లో అరడజను మందినైనా ఎరుగుదును. నేను పచ్చి బోగందాన్నయి అందులో కొందరు లక్షాధికారులయినప్పటికీ వాళ్ళని నా వొంటిమీద చెయ్యి వెయ్యనివ్వను. వాళ్ళటువంటి వాళ్ళు! ... నేను పెద్ద నీతిపరుణ్ణికాను. కాని కొందరు కొందరాడవాళ్ళ శరీరాలు నాకు పొరపాటున తగిలితే స్నానం చెయ్యబుద్ధవుతుంది. మనిషికి ఆత్మాభిమానం ఉండాలంటాను. అది లేకపోతే కుక్కలకీ మనకీ తేడా ఏమిటి?

కాని నా స్నేహితుడి దృఢ సంకల్పం తెలిసిపోయినాక ఈ విషయాలన్నీ వాడితో ఎట్లా చర్చించను? నా స్నేహితం చాలలేదు. నేను వాడిమీద పడి తింటున్నాననేది కూడా నా నోరు కట్టేసింది. మా చిన్ననాటి స్నేహం మార్పుచెందిందని తెలుసుకున్నాను. మా యిద్దరిమధ్యా ఈ తుచ్ఛ జీవితం కనపడీ కనపడని గోడకట్టింది. దాన్ని లాగెయ్యటానికి నాకు ఆధ్యాత్మిక శక్తి చాలకపోయింది.

నా స్నేహితుణ్ని నిరుత్సాహపరచటానికి చాతకాని ప్రయత్నం చేయటం కంటె అవతలి ఆడమనిషిని బెదరగొట్టితే పని జరుగుతుందని తోచింది. నా స్నేహితుడింటో లేని సమయంలో ఆమెనింటికి పిలుచుకువచ్చి ఆమెతో నిష్కర్షగా ఈ పెళ్ళి ఆగితీరాలని చెప్పాను. ఆమె గురించి నాకంతా తెలుసునని చెప్పాను.

ఆమె బిక్కమొహం వేసి, పెళ్ళి తన కవసరంలేదనీ నా స్నేహితుని అండకింద పనిమనిషిగా ఉండటానికైనా తన కభ్యంతరం లేదనీ చెప్పింది. పెళ్ళి ఆలోచన కేవలమూ నా స్నేహితుడిదేనని తేలింది.

"నీ పూర్వోత్తరాలన్నీ అతనితో చెప్పావా?" అన్నాను.

"చెప్పేదాన్నే. కాని ఆయన నన్ను చెప్పనివ్వలేదు. నా వెనుకటి విషయాలాయనకి సంబంధించినవి కావన్నారు" అన్నది.

"నీకతని డబ్బేనా కావలిసింది?" అన్నాను.

"ఆయన కోసం చచ్చిపోతాను. ఆయన డబ్బు నాకెందుకు? నాకింత తిండీ గుడ్డా తప్ప ఏమీ అక్కర్లేదు" అన్నది.

"నీ కవి దొరక్కుండా ఉండటానికి నేను నిశ్చయించుకున్నాను. ఏమంటావు?" అన్నాను.

"ఆయనకు లేని పగ నామీద మీకెందుకు?" అన్నది.

"వాడు నా స్నేహితుడు, తెలిసిందా?" అన్నాను.

"మీరేం చెబుతారాయనతో?"

"నువు కుక్కవని!"

"నేనే చెప్పేదాన్ని. ఆయన నన్ను చెప్పనివ్వలేదు."

"నన్ను చెప్పనిస్తాడు. నీ నోటివెంట వింటే దారుణంగా వినపడని విషయాలు నా నోటివెంట వింటే ఎంత భయంకరంగా వినపడతాయో తెలుసా?"

"చెప్పకండి. ఆయన్నెందుకు బాధిస్తారు? మీరు స్నేహితులు కదా?"

"కనకనే!... ఆయన బాధపడతాడనా నీ దిగులు? నిన్ను గెంటేస్తాడని లేదా?"

"నన్ను గెంటేస్తే గెంటెయ్యనివ్వండి. నేనన్ని కష్టాలూ చూశాను. ఆయన్ని బాధించకండి! మీ కాళ్ళు పట్టుకుంటాను."

ఆమె కళ్ళ వెంట నిజంగానే నీళ్ళు కారసాగినై. వొంగి నా కాళ్ళు పట్టుకోబోయింది. అకస్మాత్తుగా నేను అవశుణ్ణయిపోయి ఆమెను గట్టిగా పట్టుకున్నాను. ఆమె పెనుగులాడింది.

"అరవకు.... అల్లరి చెయ్యకుండా ఉంటే నిన్ను గురించి చెప్పటం మానేస్తాను! అల్లరి చేశావంటే–"

❀ ❀ ❀ ❀ ❀

అనుభవం మీద చెబుతున్నాను. మంచిరకం ఆడవాళ్ళ ఎదుట ఎంత నిగ్రహమైనా తెచ్చిపెట్టుకోవచ్చు. మనస్సు చలించేది దగ్గిర ఉన్న ఆడది కుక్క అని తెలిసినప్పుడే. ఈ మనిషిమీద నాకు గల నీచమైన అభిప్రాయం అణుమాత్రమైనా మారకుండానే ఆ మనిషికి అంత లోబడిపోయినాను.

కాని తీరా కాలుజారిన తరవాత నాకేదో పశ్చాత్తాపం కలిగింది. నేను దొంగ మిషమీద కోరిన మనిషి నా స్నేహితుడి కెందుకు కోరదగనిదవుతుందీ? కనీసం వాడి హృదయం నిర్మలంగా వుంది. వాడీమెని పెళ్ళాడెయ్యడానికి సిద్ధంగా ఉన్నాడు.

ఇప్పుడు వాడి పెళ్ళి తప్పించే ఉపాయం నా చేతిలో ఉంది. "చూడరా, అబ్బా! నిన్ను పెళ్ళాడటానికి స్థిరపడ్డ తరువాత ఆ మనిషి నాతో పోవటానికి అంగీకరించింది. రేపు నీ పెళ్ళి అయినాక కూడా ఇంతేగా!" అని నేను వాడితో అనగలను. కాని నా అంతరాత్మ అందుకంగీకరించలేదు. ఈ పాడుపని చేసినందుకు తాపీగా పశ్చాత్తాపపడి వాణ్ని మటుకు పెళ్ళాడనిద్దామని సంకల్పించాను. నేనాపని చెయ్యటం వల్ల ఆ మనిషి కిచ్చినమాట దక్కించుకుని అంతవరకైనా పెద్ద మనిషి తరహాగా ప్రవర్తిద్దామనిపించింది.

❀ ❀ ❀ ❀ ❀

నేను చేసిన దుర్మార్గం వాడికి తెలుస్తుందనిమటుకు నేను కల్లోకూడా అనుకోలేదు. ఆ మనిషి ఈ సంగతి వాడితో చెబుతుందని నాకెందుకనుమానం పోతుందీ?

మర్నాడు సాయంకాలం నా స్నేహితుడింటికొస్తూనే నాకేసి చూసిన విషాదకరమైన చూపు నాకర్థం కాలేదు. కాని వాడు, "ఎందుకురా అటువంటి పనిచేశావ్? ఎంత చెడ్డా మనం స్నేహితులం కద?" అనేటప్పటికి నా గుండె లవిసిపోయినై. నోట మాటరాలేదు. నాకు దుఃఖంతోపాటు కోపం కూడా వచ్చింది - ముఖ్యంగా నా మీదనే! కాని క్షణంలో అది ఆ ఆడమనిషి మీదిక్కూడా పోయింది. సిగ్గులేని మనిషి! వాడితో ఈ సంగతి ఏమని చెప్పింది? తను అదివరకు పోయినవాళ్ళలో ఎవడికన్న తీసిపోయినాను?

ఇదంతా వ్యర్థతర్కం. ఇప్పుడీ మనిషి కాబోయే స్నేహితుడి భార్య. ఆ విషయం వదిలేసి ఎంత తర్కించి ఏం లాభం? కాని నాకట్లా అనిపించలేదు. ఈ పెళ్ళి కాకుండా చేస్తే నేను చేసిన పని అంత దురన్యాయం కాకుండా పోతుంది. అందుకుగాను బ్రహ్మాస్త్రం నా దగ్గిర ఉంది. దాన్ని ప్రయోగింతామంటే నిన్న అంతరాత్మ అడ్డొచ్చింది కాని ఇప్పుడది అడ్డురాలేదు.

"అవునురా, ఈ మనిషెటువంటిదో నీ కిప్పటికైనా రుజువయిందా? రేపు నిన్ను పెళ్ళాడినా ఈ పనే చేస్తుందని నీకు రుజువు చెయ్యటానికే-" అని అంతటితో ఆగాను.

నా స్నేహితుడు నాకేసి దీనంగానే చూస్తూ ఈసారి నవ్వాడు. ఆ నవ్వు తలుచుకుంటే నా గుండె ఇప్పటికీ ఖలుక్కుమంటుంది. అది యావజ్జీవమూ నా గుండెలో గుచ్చుకున్న బల్లెమే.

"రంకుతనం చెయ్యటానికెటువంటి కారణాలుంటాయో నువ్వే చూశావు కాదూ?" అన్నాడు.

అంతే. ఇక వాడా విషయం మాట్లాడలేదు. నేనూ మాట్లాడలేదు. ఏముంది మాట్లాడటానికి...

ఆఖరుకు వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకున్నారు....

సీతాపతి చెప్పటం మానేశాడు. నేనతని అంతరాత్మలో పడుతున్న బాధ పూర్తిగా ఊహించగలిగాను. అంత దారుణమైన పని ఎన్నడూ చేసి ఉండనందుకు నా కెంతో తృప్తి కలిగింది. అతను నేననుకున్నంత ఉదారహృదయుడు కానందుకు కూడా నాకు కష్టం వేసింది. ఆ క్షణాన అతని మొహాన ఉన్న భావం చూస్తే అతని అంతరాత్మలో ఉన్న పాపపంకిలం చూస్తున్నట్టే ఉంది.

రెండు మూడు నిమిషాలపాటిద్దరమూ మాట్లాడలేదు. ఆఖరుకు నేను, "ఇదంతా జరిగి ఎన్నాళ్ళయింది?" అన్నాను.

సీతాపతి నిద్రలోంచి బయటపడ్డవాడల్లే, "ఏదంతా జరిగి?" అన్నాడాశ్చర్యంతో. చిత్రంగా అతని మొహాన ఉన్న భావం కాస్తా అంతలో మాయమై మామూలు మొహమయింది. అతను చిరునవ్వు కూడా నవ్వాడు.

"ఇప్పుడు మీరు చెప్పిన సంఘటనే," అన్నాను.

"ఎబ్బే, అది నేను రాద్దామనుకుంటున్న కథండీ? మీరు కూడా కథలు రాస్తారు గనక మీ అభిప్రాయం తెలుసుకుందామని చెప్పాను. ముందస్తుగా కథ అని చెబితే శ్రద్ధగా వింటారో లేదో అని దాచి పెట్టాను. ఇది కథగా రాస్తే ఎట్లా ఉంటుందంటారు? ఎవరన్నా అసలు అచ్చు వేసుకుంటారా?" అన్నాడు సీతాపతి.

నేను తక్షణమే విమర్శకుడి పోజుపెట్టి, "కథ – షుమారుగా – బాగానే అంటే మామూలుగా ఇప్పుడు వచ్చే కథలల్లే – అంటే, ఇంకా అంతకన్న కూడా అని చెప్పొచ్చు! – ఉందిగాని వాస్తవికత లేదండీ!... చూశారూ, కథ అంటే వాస్తవంగా, నమ్మించేట్టు – అంటే, జరిగినట్టు, ఉంటే చాలా బావుంటుంది ... మాట వరసకి మీ స్నేహితుడంటి మనుష్యులెక్కడున్నారు చెప్పండి? – అంటే, మీ కథలో స్నేహితుడు సుమండీ! ... అది నిజమైన స్నేహితుడి విషయం కాదని దాదాపు మొదట్లోనే నాకు తెలిసిపోయిందనుకోండి! .... రాయొచ్చంటాను? ఫరవాలేదు! తప్పకుండా రాయండి. కావలిస్తే ఏ పత్రిక్కయినా నేను స్వయంగా సిఫార్సు చేస్తాను" అన్నాను.

"సరే మీరు చెబుతున్నారు కనక రాసి చూస్తాను" అన్నాడు సీతాపతి.

అతను రాసి అచ్చుపడే లోపుగానే ఇదంతా ఏ పత్రిక్కన్నా అర్జెంటుగా పంపెయ్యాలి...

***మొదటి ముద్రణ : రూపవాణి, డిసెంబర్ 1944***